క్లుప్తంగా

మెరుగైన ఫలితాలు సాధించాలి



ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ సతీష్‌బాబు

రౌతులపూడి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలను ఎంఈఓ–1 కె.సతీష్ బాబు, ఎంఈఓ–2 గాడి కొండబాబు ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్‌ను అనుసరించి ప్రతి విద్యార్థి మెరుగైన విద్యను అభ్యసించేలా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలని ఎంఈఓలు సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ కె.ఎరకయ్యనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానానికి ముదునూరి విరాళం

అన్నవరం: స్థానిక చిన్నరావిచెట్టు సెంటర్ పురగిరి క్షత్రియుల రామకోవెల వద్ద గత పది రోజులుగా నిర్వహిస్తున్న దసరా నవరాత్రుల వేడుకలు విజయదశమి పర్వదినంతో గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గం పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొని అన్నదాన కార్యక్రమానికి రూ.ఐదు వేలు విరాళాన్ని నిర్వాహకులకు అందచేశారు. ఆయన వెంట స్థానిక ఎంపీటీసీ దడాల సతీష్, పార్టీ నాయకులు తదితరులున్నారు.

8న సర్వసభ్య సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె. హరికృష్ణ సత్యరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 8న బుధవారం మధ్యాహ్నం 2.గంటలకు ప్రారంభంకానున్న ఈ సమావేశంలో మండల పరిధిలోని జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, నిధులు సమీకరణ వంటి అంశాలపై చర్చ జరగనున్నందున ఆయా శాఖలకు చెందిన అధికారులు పూర్తి సమాచారంతో తప్పకుండా సమావేశానికి హాజరుకావాలన్నారు.

పోలీసుల డ్రోన్ పెట్రోలింగ్



రామేశంపేటలో డ్రోన్ పెట్రోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న సీఐ

గండేపల్లి: మండలంలోని హైవేని అనుకుని నిర్వహిస్తున్న దాబాలు, సూరంపాలెంలో రామేశంపేటలోని ప్రైవేటు హాస్టల్స్ వద్ద ప్రత్యేక నిఘాకోసం డ్రోన్ పెట్రోలింగ్ ప్రహార నిర్వహిస్తున్నట్టు సీ.ఐ వైఆర్కే శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆయన ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులు, విద్యార్థుల సాకర్యార్థం చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా డ్రోన్ పెట్రోలింగ్ చేయిస్తున్నట్టు తెలియజేశారు. ఆయన వెంట ఏఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఆదిత్య జట్టు



టోర్నమెంట్‌కు ఎంపికైన క్రీడాకారుల జట్టు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ తరుపున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ మెన్ టోర్నమెంట్–2025కు ఆదిత్య యూనివర్సిటీ క్రీడాకారులు ఎంపికైనట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో అక్టోబర్ 4 నుంచి 7 వరకు జరగనున్న కబడ్డీ మెన్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తరలివెళ్లినట్టు ఆయన పేర్కొన్నారు.

ఎస్టీలపై దాడి చేసిన అగ్రకులస్తులను అరెస్ట్ చేయాలి

జగ్గంపేట: మండల కేంద్రం జగ్గంపేట శివారు రామవరం వద్ద రంగవల్లి నగర్‌లోని ఎస్టీ (ఎరుకుల)లకు చెందిన పలువురు వ్యక్తులపై దొంగతనం నెపంతో కొంతమంది అగ్రవర్ణాల వారు దాడి చేయడం దారుణమని వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు కూలీ సంఘం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టింది. శుక్రువారం జరిగిన ఈ ఆందోళన అనంతరం మండల తహసీల్దార్ జెవిఆర్ రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు మాట్లాడుతూ రంగవల్లి నగర్‌లో రామవరం గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారు ఎస్టీ కులానికి చెందిన వారిపై దాడులు చేసిన పోలిసులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నేతలు, మహిళా నేతలు పాల్గొన్నారు.

ఆధార్ అవస్థలు

- అప్‌డేట్‌కు తప్పని తిప్పలు
- పడకేసిన ప్రత్యేక కేంద్రాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తొండంగి గ్రామ సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న ఆధార్ కేంద్రం

తొండంగి: ప్రభుత్వపరంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో అధార్ కార్డుకు ప్రాముఖ్యత పెరిగింది. రేషన్ షాపులు మొదలుకొని విద్యార్థులు, ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణాలు చేసే మహిళల వరకు ఆధార్ కార్డును ప్రభుత్వం తప్పని సరి చేసింది. దీంతో ప్రజలంతా ఆధార్ కార్డు అప్‌డేట్ సెంటర్ల వైపు పరుగులు తీస్తున్నారు. ఇంటిల్లిపాది ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బ్యాంకులు, గ్రామ సచివాలయాలు, పోస్టాఫీసు, మీసేవా కేంద్రాల్లోనూ ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ మొక్కుబడిగా సాగుతుండటంతో ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు.

సచివాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మండలంలోని 22 పంచాయతీల్లో 53 గ్రామాలున్నాయి. కానీ ప్రభుత్వం కేవలం ఐదు గ్రామాల్లో మాత్రమే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలోని సేవలు సక్రమంగా నిర్వహించడం లేదు. పంచాయతీలోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి, స్థానికుడు, బెండపూడి

ఇదీ పరిస్థితి

మండలంలోని 22 పంచాయతీల పరిధిలోనూ 53 గ్రామాలున్నాయి. మెట్ట, తీరప్రాంతాల్లో దాదాపు లక్షమంది జనాభా ఉన్నారు. అన్నివర్గాల ప్రజలకు తమ ఆర్థిక కార్యకలపాలకు, ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అన్నిటికీ ఆధార్‌కార్డు ప్రధాన గుర్తింపు కార్డుగా వినియోగిస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ కాకుంటే ఓటీపీ, చేతి వేలిముద్రలు మార్పుల కారణంగా ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

పనిచేయని కేంద్రాలు

మండలంలోని వేమవరం,కె.పెరుమాళ్లపురం, రావికంపాడు, తొండంగి, బెండపూడిలలో ఆధార్‌కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒంటిమామిడి, సరిహద్దు గ్రామమైన అన్నవరం పోస్టాఫీస్, బ్యాంకులలోనూ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ ఈ కేంద్రాలన్నీ మొక్కుబడి తంతుగానే నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్రతీచోటా సర్వర్ డౌన్ అంటూ, గ్రామ సచివాలయాల్లో సిబ్బంది లేరంటూ తదితర కారణాలు చెప్పడంతో ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వీటి నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దూరప్రాంతాలకు వెళ్లేందుకు అష్టకష్టాలు

మండలంలోని ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలు ఇతర ప్రాంతాలైన తుని, కత్తిపూడి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. తీర ప్రాంతంతోపాటు మెట్ట ప్రాంతాల్లోనూ సరైన బస్సు సౌకర్యం లేక ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వెళ్లినా రద్దీగా ఉండటంతో నాలుగైదుమార్లు తిరగాల్సి వస్తుంది. ఆధార్ అప్‌డేట్ కోసం విలువైన కాలంతో పాటు, వ్యయప్రయాసలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

పెరిగిన చార్జీలు

గుర్తింపు కార్డుగా ప్రభుత్వం ఆధార్‌ను తప్పని సరి చేయంతో ఆధార్ అప్‌డేట్ గతంలో ఉచితంగా నిర్వహించేవారు. కనీస చార్జీ తీసుకునే వారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాలంటే 17 ఏళ్ల వయస్సు ఏళ్ల దాటిన వారికి ప్రస్తుతం రూ.100 ఉండగా ఇప్పుడు రూ.125 చెల్లించాల్సి ఉంది. ఆధార్ అడ్రస్ మార్పునకు ప్రస్తుతం రూ.50 ఉండగా ఇప్పుడు రూ.75 కు పెరిగింది. కొత్తకార్డు మంజూరుకు ఏటువంటి రుసుములేదు. వేలాది కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు పెంచిన ఆధార్‌కార్డుల రుసుములు భారంగా మారాయి.

సత్యదేవుని దర్శించిన నటుడు శుభలేఖ సుధాకర్



శుభలేఖ సుధాకర్‌కు వేదాశీస్సులు అందచేస్తున్న పండితులు

అన్నవరం: ప్రముఖ సినీనటుడు శుభలేఖ సుధాకర్ విజయదశమి పర్వదినం సందర్భంగా గురువారం రత్నగిరి సత్యదేవుడిని దర్శించి పూజలు చేశారు. ఆయనకు రత్నగిరిపై పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందచేశారు. సుధాకర్ వెంట వ్రతపురోహితులు నాగాభట్ల రవిశర్మ ఉన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం పర్వదినం సందర్భంగా చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిననంతరం చండీ హోమం ప్రారంభించారు. హోమం అనంతరం హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు.

సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలి



ఒమ్మంగిలో విజయదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు, తదితరులు

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలో ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో విజయదుర్గ అమ్మవారిని గిరిబాబు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మదయకు ప్రతి ఒక్కరూ పాత్రులకావాలన్నారు. ప్రతి ఏడాది ఆలయ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు రామిశెట్టి రమేష్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పట్టణంలో శుక్రవారం దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

లాల్‌బహుదూర్ శాస్త్రికి ఘనంగా నివాళులు



ఏలేశ్వరంలో శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: మాజీ ప్రధానమంత్రి లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలోని శాస్త్రి విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సౌమ్యుడుగా, నిజాయితీకి మారుపేరుగా జీవించిన లాల్‌బహుదూర్ శాస్త్రిని ప్రతిఒక్కరూ అదర్శంగా తీసుకోవాలని పార్టీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, కావలి శ్రీనివాసరావు, గంప తేజ, అరవాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల చంటిబాబుకు నాయకుల సత్కారం



జ్యోతుల చంటిబాబును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులుగా జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును నియిమించడం పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. సీఈసీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా జ్యోతుల చంటిబాబును ఇర్రిపాక గ్రామంలో జగ్గంపేటకు చెందిన పలువురు పార్టీ ముఖ్య నాయకులు కలిసి అభినందనలు తెలిపి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ, ఉయ్యూరి నాని, క్రిస్టియన్ మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

16 గ్రాముల బంగారు హారం సమర్పణ

గోకవరం: మండల కేంద్రం గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైయున్న శ్రీకనక దుర్గమ్మకు గ్రామానికి చెందిన చింతల వెంకటరమణ కుటుంబ సభ్యులు 16 గ్రాముల బంగారు హారాన్ని అమ్మవారికి సమర్పించారు. వెంకటరమణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆనందరావు, శ్రీనివాస్‌రావు, కుమార్తె పూడి శ్రీదేవిలు ఈ హారాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి అలంకరించారు.

మహాత్మాగాంధీ సేవలు చిరస్మరణీయం



శంఖవరం పీహెచ్‌సీలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది



ధర్మవరంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మురళీకృష్ణంరాజు

కిర్లంపూడి: మహాత్మగాంధీ సేవలు చిరస్మరణీయమని సీనియర్ నాయకుడు ఎస్.ఎస్. రాంకుమార్ అన్నారు. గురువారం స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

గాంధీజీ ఆశయాలు నెరవేరుద్దాం

శంఖవరం: ప్రతి ఒక్కరు ఐక్యమత్యంగా ఉంటూ హింసా ప్రవృతిని మానుకుని జాతి పిత గాంధీజీ కన్న కలలను సాకారం చేసేందుకు పాటు పడదామని వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్ పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీలో గాంధీజీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి సిబ్బంది పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

ప్రత్తిపాడు రూరల్: మహాత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో గత వైఎస్సార సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా నెరవేరిందని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరంలోని ఆయన స్వగృహంలో మహాత్మాగాంధీ 156వ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహాత్మా గాంధీని యువత స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సేవలో ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధేయవాదం ప్రపంచానికే ఆదర్శం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ జంక్షన్ వద్ద గాంధీ విగ్రహానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్ముని అహింసావాదం, సత్యాగ్రహం, ఉపవాసం వంటి నిరసన కార్యక్రమాలు ప్రపంచానికే ఆదర్శమన్నారు.

వాడవాడలా జాతిపితకు నివాళులు

ఏలేశ్వరం: బ్రిటీషువారి బానిస సంకెళ్ల నుంచి తన అహింస మార్గంతో దేశానికి విముక్తి కల్పించిన జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గవ్యాప్తంగా వాడవాడలా బాపూజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని షిర్డినగర్‌లోని గాంధీనగర్‌లో గాంధీజీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీనేతలు కోరాడప్రసాద్, లోగీసు శేఖర్, కోరాడ అప్పలస్వామి, సామంతుల చిన్నారావు, కావలి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు గొల్లపల్లి త్రిమూర్తులు, మున్సిపల్ కౌన్సిలర్లు బదిరెడ్డి గోపి, మూదినారాయణస్వామి గాంధీజీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పరామర్శ



వెంకటరమణను పరామర్శిస్తున్న జ్యోతుల చంటిబాబు

గోకవరం: మండల కేంద్రం గోకవరానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వెంకటరమణను జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు జ్యోతుల చంటిబాబు శుక్రవారం పరామర్శించారు. సుంకర వెంకటరమణ ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న చంటిబాబు బాధితుడుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంతో తిరిగి పార్టీకి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వెంట పార్టీ నాయకులు బండారు రాజా, ఇళ్ల అప్పారావు కాపు, తోలేటి రాంప్రసాద్, బాడితబోయిన చిన్నా, నందూరి బుజ్జి, ఇనకోటి దివాణం తదితరులున్నారు.

రథోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ



అమ్మవారి రథాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, కంబాల శ్రీనివాస్‌రావు తదితరులు

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయ రథోత్సవ ఏర్పాట్లను నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ పరిశీలించారు. అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాల్లో ఊరేగింపునకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాస్‌రావు రూ.50 లక్షల వ్యయంతో రథాన్ని తయారు చేయించారు. శుక్రవారం డీఎస్పీ పరిశీలించి భద్రత ఏర్పాట్లపై కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కంబాల శ్రీనివాస్‌రావు, వరసాల ప్రసాద్, ఆలయ అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, పెద్దాడ వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు

- ఆనందోత్సవాల నడుమ దసరా
- శమీపూజతో సమాప్తం



దుర్గామాతకు బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు



దుర్గమ్మ తల్లిని దర్శించుకున్న దాడిశెట్టి రాజా, తదితరులు

తుని రూరల్: మండల వ్యాప్తంగా దశమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గత నెల 22న ప్రారంభమైన శరన్నవరాత్రులు గురువారం శమీ (ఆయుధ) పూజతో ముగిశాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా తుని పట్టణం, ఎస్.అన్నవరం గ్రామాల్లో పర్యటించి అమ్మవార్లను దర్శించుకున్నారు.

కనకదుర్గకు మొక్కుల చెల్లింపు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి కొత్తూరులో కొలువైయున్న విజయ కనకదుర్గ అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించారు. దేవి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా 11వ రోజు గురువారం శరన్నవరాత్రిమహోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనకు గ్రామస్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

దుర్గమ్మకు బోనాల సమర్పణ

తొండంగి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కొమ్మనాపల్లిలో గురువారం బోనాల జాతర ఘనంగా జరిగింది. గ్రామశివారు ఏ.వి.నగరం రహదారిలో ఉన్న దుర్గామాత ఆలయం వద్ద దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. గ్రామానికి చెందిన 500 మంది మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి బోనాలు రెండు కిలోమీటర్లు దూరం పాదయాత్ర బయలుదేరి బాజా భజంత్రీలు, వేదమంత్రాలతో అమ్మవారి ఆలయంలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పసుపు, కుంకుమలు, నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. భారీ అన్నసమారాధన నిర్వహించగా పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలు సంప్రదాయ నృత్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా బోనాల జాతర

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి గ్రామంలో విజయదుర్గ అమ్మవారి బోనాల పండుగను భక్తులు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక మహిళలు, యువతులు బోనాలను భారీ ఎత్తున ఊరేగించారు. అనంతరం విజయదుర్గ అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించారు. అనంతరం రామిశెట్టి రమేష్, మాతాలక్ష్మీ దంపతుల పర్యవేక్షణలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అమ్మవారికి చారె, చీర సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

కనకదుర్గమ్మ నిమజ్జనం

శంఖవరం: మండలంలోని కత్తిపూడి,శంఖవరం,జి.కొత్తపల్లి, గౌరంపేట పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కనకదుర్గమ్మ అమ్మవారిని ఊరేగించారు. సీతంపేట మీనాక్షీ కనకదర్గమ్మ అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రులు కుంకుమ పూజలు అందుకున్న అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి మేళ తాళాలతో,బాణాసంచాతో భక్తులు,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

ప్రత్తిపాడు: విజయదశమి ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. పది రోజుల పాటు ప్రత్తిపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీదుర్గమ్మ వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విజయదశమిని పురస్కరించుకుని శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్థానిక పుష్కర కాలువలో ఘనంగా నిమజ్జనం చేశారు.

ఘనంగా రావణ సంహారం


అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించిన దసరా వేడుకలు విజయదశమి పర్వదినం సందర్భంగా గురువారం రాత్రి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన రావణ సంహారం కార్యక్రమంతో ముగిశాయి. జూనియర్ కళాశాల మైదానంలో సత్యదేవుడు, అమ్మవారి చిత్రపటానికి పూజలు అనంతరం రావణ సంహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాణసంచాతో రూపొందించిన సుమారు 30 అడుగుల ఎత్తు గలిగిన రావణబ్రహ్మ విగ్రహాన్ని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు బాణంతో గురిచూసి కొట్టడంతో నిమిషాల వ్యవధిలో రంగుల వెలుగులు విరజిమ్ముతూ మంటల్లో దహనమయ్యింది. కార్యక్రమాన్ని వీక్షించడానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీ.రామకృష్ణ, ఇతర అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాజ రాజేశ్వరీగా తలుపులమ్మ తల్లి


తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైఉన్న తలుపులమ్మ అమ్మవారు ఆదిపరాశక్తి అయినా రాజ రాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం వేదపండితులు, ప్రధాన అర్చకులు తలుపులమ్మ అమ్మవారికి రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కుంకుమపూజలు, ప్రత్యేక పూజలు, మహాచండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. శమీ పూజ కాలంలో పెద్ద సంఖ్యలో కొత్త, పాత వాహనదారులు లోవ దేవస్థానం ప్రాంగణంలో వాహన పూజలు చేసుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా విజయదశమి వేడుకలు


గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో గల బాలా త్రిపుర సుందరి అమ్మవారికి, చండి నవార్ణ, నవార్ణ, నవార్ణ దుర్గాదేవి అమ్మవార్లకు 11 రోజుల పాటు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి అనంతరం శమీ వృక్ష పూజతో దేవి శరన్నవరాత్రులు ముగిశాయి. పలువురు ముత్తైదువులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి సౌభాగ్యాన్ని కోరుకున్నట్టు ఆలయ అర్చకులు వివిఎస్ఎన్ మూర్తి తెలిపారు.



మల్లేపల్లిలో అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



అన్నవరంలో రావణ సంహారనికి సిద్ధం చేసిన బొమ్మ



మంటల్లో దగ్ధమవుతున్న రావణుడి బొమ్మ

రత్నగిరిపై విజయదశమి వేడుకలు



అనివేటి మండపంలో శమీపూజ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో విజయదశమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చి భక్తులచే పూజలు అందుకున్నారు. దర్బారు మండపంలో ఉదయం 11 గంటలకు చండీహోమం పూర్ణాహుతి, రాత్రి అనివేటిమండపంలో శమీ వృక్షం వద్ద శమీపూజ ఘనంగా నిర్వహించారు.